సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



ఫ్లెక్సీలపై చర్యలకు డిమాండ్

వివిధ ప్రాంతాల్లో వివాదాస్పద వ్యాఖ్యలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలు దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.


8 లో



స్ప్రేయర్ మొరాయిస్తే.. ఫియరే..!

పంటలను ఆశించిన చీడపీడల నివారణకు స్ప్రేయర్లతో పరుగు మందులు పిచికారీ చేస్తారు. చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటే అవి ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 8,37,974 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడుదల చేశారు. డెల్టాలకు సంబంధించి తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున విడిచి పెట్టారు.

న్యూస్‌రీల్

జాయింట్ కలెక్టర్‌గా మేఘా స్వరూప్



సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా మేఘా స్వరూప్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన మేఘా స్వరూప్ గతంలో అనంతపురం నగర పాలకసంస్థ కమిషనర్‌గా, మదనపల్లి సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఆయనను జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. ప్రస్తుతం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న చిన్నరాముడును జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్టు చేయమన్నారు.

మెప్మా పీడీగా కనకరాజు



కలెక్టర్ ప్రశాంతిని కలిసిన మెప్మా పీడీ కనకరాజు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మెప్మా ప్రాజెక్టు జిల్లా డైరెక్టర్‌గా టి.కనకరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీపీఎం శ్రీదేవితో కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఏపీపీఎస్సీ ద్వారా 1991లో మున్సిపల్ పరిపాలన విభాగంలో ఉద్యోగంలో చేరిన కనకరాజు.. మేనేజర్, కమిషనర్ పదవుల్లో హైదరాబాద్, విజయవాడ, ఉయ్యూరు, మండపేట, శ్రీకాకుళం, సామర్లకోటలలో సేవలందించారు. ప్రస్తుతం సామర్లకోట పురపాలక సంఘం మేనేజర్‌గా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై తూర్పు గోదావరి మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా..

కంబాలచెరువు: ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పనిచేసిన లక్ష్మీసూర్య ప్రభ బదిలీపై వెళ్లడంతో సౌభాగ్యలక్ష్మిని ఇన్‌చార్జిగా నియమిస్తూ కొద్ది రోజుల క్రితం డీఎంఈ ఉత్తర్వులు ఇచ్చింది.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ముగ్గురి ఎంపిక



మోటూరి మంగారాణి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గురుపూజోత్సవం సందర్భంగా అందించే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లాలోని ముగ్గురు ఎంపిక య్యారు. ఈ మేరకు విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. లాలా చెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు మోటూరి మంగారాణి, రాజమహేంద్రవరం రూరల్ శాటిలైట్ సిటీ జెడ్పీహెచ్ఎస్ ప్లస్ ప్రధానోపాధ్యాయురాలు బత్తిన రాజరాజేశ్వరి, కుతుకులూరు జెడ్పీహెచ్ఎస్ ప్లస్ తెలుగు ఉపాధ్యాయుడు నక్కిన వీర రాఘవరావులకు ఈ గౌరవం దక్కింది. అమరావతిలో ఈ నెల 5న జరిగే గురుపూజోత్సవంలో ముఖ్యమంత్రి, విద్యాశాఖామంత్రి చేతుల మీదుగా వారు అవార్డులు అందుకోనున్నారు. కాగా.. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు, అర్బన్ రేంజ్ డీవై బి.దిలీప్ కుమార్, అర్బన్ ఎంఈఓ 2 రమా రజని తదితరులు అభినందించారు.

రత్నగిరి సేవలపై భక్తుల అసంతృప్తి



అన్నవరం: రత్నగిరికి వచ్చే భక్తుల అసంతృప్త స్థాయి అంతకంతకూ పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. భక్తు సేవలందించడంలో ఆగస్టు నెలలో కూడా దేవస్థానం పాలకవర్గం విఫలమైనట్టు రాష్ట్ర ప్రభుత్వ సర్వేలో వెల్లడైంది. ఆగస్టు నెలలో సత్యదేవుని సన్నిధికి వచ్చే భక్తుల్లో దాదాపు 30 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. గత జూలై 26 నుంచి ఆగస్టు 25వ తేదీ వరకు రాష్ట్రంలోని ఏడు ప్రముఖ దేవస్థానాలలో భక్తులకు అందుతున్న సేవలపై రాష్ట్ర ప్రభుత్వం వాట్సప్, ఐవీఆర్ఎస్ ద్వారా సర్వే నిర్వహించింది. సింహాచలం, అన్నవరం, ద్వారకాతిరుమల, విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీశైలం, కాణిపాకం దేవస్థానాలలో నిర్వహించిన సర్వేలో శ్రీకాళహస్తి ప్రథమస్థానంలో నిలవగా అన్నవరం దేవస్థానం ఐదో స్థానంలో నిలిచింది. కాగా కాణిపాకం ఏడో స్థానంలో నిలిచింది.

ధ్రువీకరణం



- దివ్యాంగులపై కూటమి కక్ష
- పింఛన్లు తొలగించేందుకు కుట్ర
- ఆందోళనల నేపథ్యంలో ఈ నెల పంపిణీ
- మళ్లీ రీ–వెరిఫికేషన్ చేస్తామని ప్రకటన
- టెన్షన్‌లో లబ్ధిదారులు

సాక్షి, రాజమహేంద్రవరం: సాధారణంగా ప్రజల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేస్తాయి. వారికి అవసరమైన వివిధ పథకాలను ప్రవేశపెడతాయి. కానీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం దీనికి భిన్నంగా వ్యవహరిస్తోంది. కొత్త పథకాల మాట దేవుడెరుగు.. ఉన్న వాటినే తొలగించేందుకు చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా దివ్యాంగులపై కక్ష కట్టింది. వారి పింఛన్లను తొలగించేందుకు నడుం బిగించింది. దీంతో దివ్యాంగులు, వైఎస్సార్ సీపీ నాయకులు అనేక చోట్ల ఆందోళనలు చేశారు. వాటికి తలొగ్గిన సర్కారు తాత్కాలికంగా ఈనెల యథాతథంగా దివ్యాంగ పింఛన్లు పంపిణీ చేసింది. కానీ శాశ్వతంగా అందిస్తామని ప్రకటన చేయలేదు. తిరిగి వైకల్య శాతం పరీక్షిస్తామని వెల్లడించింది. దీంతో దివ్యాంగుల్లో మళ్లీ టెన్షన్ ప్రారంభమైంది. గతంలో మాదిరి వైకల్య శాతం తగ్గించి పింఛన్లు తొలగిస్తారని వారందరూ ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా 2,35,813 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేస్తున్నారు. అందులో వివిధ కేటగిరి పరిధిలో 33,177 దివ్యాంగ పింఛన్లు ఉన్నాయి. వీటిలో 3,211 మందికి 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నట్లు గుర్తించారు. రీ–అసెస్‌మెంట్‌లో భాగంగా వీరికి నోటీసులు జారీ చేశారు. వీరికి పూర్తి స్థాయిలో పింఛన్లు తొలగించినట్లు ప్రకటించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు వెల్లువెత్తడంతో కంటితుడుపు చర్యగా ప్రభుత్వం వీరిలో ఆయా కేటగిరీలో తాత్కాలిక సర్టిఫికెట్లు ఉన్న మెంటల్ రిటార్డేషన్, మెంటల్ ఇల్లెనెస్, లోకోమోటర్ కేటగిరికి చెందిన 640 మందికి మాత్రమే నోటీసులు ఉపసంహరించుకున్నారు. వీరికి సెప్టెంబర్ 1వ తేదీన యథావిధిగా పింఛన్లు పంపిణీ చేశారు.

మళ్లీ నిర్ధారణ పరీక్షలు

ఇప్పటికే అనర్హులుగా తేలి, తిరిగి వైకల్య శాతం కోసం అప్పీలు చేసుకున్న వారికి మళ్లీ వైకల్య నిర్ధారణ పరీక్షలు చేయించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా 2,571 మంది వికలాంగ పింఛను దారుల్లో 2,538 మంది.. సంబంధిత ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ల వద్ద అప్పీలు చేసుకున్నారు. 33 మంది మాత్రమే వివిధ కారణాలతో దరఖాస్తు చేసుకోలేదు. వారిలో 21 మంది అప్పీల్ చేసుకునేందుకు ఆసక్తి లేదని లిఖిత పూర్వకంగా ఇచ్చినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ తిరిగి పరీక్షలను చేయాల్సి ఉంది. వాళ్ల నిజంగా వికలాంగులేనా అని నిర్ధారించి పింఛన్ మీద తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇందుకు గాను ప్రస్తుతం కొనసాగుతున్న వికలాంగుల వెరిఫికేషన్ ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసింది. అప్పటి వరకు దివ్యాంగుల కేటగిరీ పింఛను దారుల్లో అనర్హుల గుర్తింపునకు చేపట్టిన సదరం (వైకల్య నిర్ధారణ) తిరిగి పరిశీలనకు వైద్య ఆరోగ్య శాఖ తాత్కాలికంగా బ్రేక్ వేసింది.

వైకల్య శాతంపై ఆందోళన

సదరం సర్టిఫికెట్ల జారీ 2009–2010లో ప్రారంభమైంది. ఆ సమయంలో 100 శాతం వికలత్వం ఉంటే.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ వెరిఫికేషన్‌లో 40 శాతానికి తగ్గిపోతోంది. అదెలా తగ్గుతుందో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఫలితంగా దివ్యాంగులు పింఛనుకు అనర్హులుగా మారారు. గతంలో వెరిఫై చేసి వైకల్య ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇచ్చింది వైద్యులే.. అప్పుడు 85, 90, 100 శాతం వైకల్యం ఉంటే.. ఇప్పుడు 40 శాతం లోపు ఎలా తగ్గుతోందంటూ బాధితులు వాపోతున్నారు. ఇకపై నిర్వహించే వైకల్య ధ్రువీకరణ శాతంలో కూడా ఇదే పంథా అవలంబిస్తే తమ పరిస్థితి ఏంటన్న ఆందోళన దివ్యాంగుల్లో నెలకొంది. అలా కాకుండా వైకల్య శాతం పారదర్శకంగా నమోదు చేయాలని దివ్యాంగులు డిమాండ్ చేస్తున్నారు.

పింఛన్లు తగ్గించుకునేందుకే..

సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గద్దె నెక్కాలన్న తలంపుతో చంద్రబాబు.. సంక్షేమ పథకాలు, పింఛన్లపై అమలుకు సాధ్యం కాని ప్రకటనలు చేశారు. అధికారంలోకి వచ్చాక కోతలు ప్రారంభించారు. దివ్యాంగులపై కనీస కనికరం లేకుండా పింఛన్ల తొలగింపునకు నాంది పలికారు. ఇదంతా పింఛన్లు తగ్గించుకునేందుకు ఆడుతున్న నాటకంలో భాగమే అన్న ఆరోపణలున్నాయి. దీనిపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేయడంతో వెనక్కు తగ్గిన ప్రభుత్వం తొలగింపు ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చినట్లు తెలిసింది. తిరిగి రీ వెరిఫికేషన్‌కు మూడు మాసాల సమయం పడుతుంది. ఆ మూడు నెలల్లో దివ్యాంగులను మభ్యపెట్టి చాపకింద నీరులా తొలగించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న దివ్యాంగులు (ఫైల్)

దివ్యాంగులకు అన్యాయం తగదు



“వైకల్య శాతం పేరుతో దివ్యాంగుల పింఛన్లు నిలుపుదల చేయాలనుకోవడం దారుణం. ఆందోళనల నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వం ఈ నెలకు అందరికీ పింఛన్లు ఇచ్చింది. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా అందరికీ ఇవ్వాలి. అలా కాకుండా తిరిగి రీ వెరిఫికేషన్ చేస్తామని ప్రకటించింది. దీంతో దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి రీ వెరిఫికేషన్ లేకుండా పాత విధానంలో దివ్యాంగులందరికీ పింఛను అందజేయాలి.”

– సబ్బెళ్ల విజయదుర్గారెడ్డి,
వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆందోళనకరంగా భూగర్భ జలాలు



సమావేశంలో మాట్లాడుతున్న భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్

- నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి
- భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్

నల్లజర్ల: మండలంలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి అడుగంటాయని, తక్షణం నీటి సంరక్షణ చేపట్టకపోతే ఈ ప్రాంతంలోని పంట భూములు ఎడారిగా మారే ప్రమాదం ఉందని భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం డ్వామా, వ్యవసాయ, ఉద్యాన, నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశమై భూగర్భ జలాల సంరక్షణ – పెంపుపై చర్చించారు. డీడీ మాట్లాడుతూ భూగర్భ జలమట్టాలు 20 అడుగుల నుంచి 50 అడుగుల లోతుకు తగ్గిపోయాయని, ఇది ఆందోళన కలిగించే అంశమన్నారు. ఇక్కడ వ్యవసాయమంతా బోరుబావులపైనే ఆధారపడి జరుగుతోందన్నారు. ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో వ్యవసాయం, తోటల పెంపకంలో డ్రిప్, స్ప్రింక్లర్లు వినియోగం పెరిగి నీటి వినియోగం తగ్గాలన్నారు. రీచార్జి పిట్‌లు, ఫారంపాండ్స్, రింగ్ ట్రెంచ్‌లు, చెరువుల పూడిక తీత పనులు చేపట్టడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకునే అవకాశం ఉందన్నారు. డ్వామా ఏపీడీ బి.రాంప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్ల కాలపరిమితిలో ప్రణాళిక బద్ధంగా ఈ పనులు చేపట్టి, పురోగతి సాధించవచ్చన్నారు. ఏపీఎంఐపీ పీడీ ఏ.దుర్గేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందుతున్న రైతులు రానున్న ఐదేళ్లలో తమ పొలాల్లో ఫారంపాండ్లు, రింగ్ ట్రెంచ్‌లు ఏర్పాటు చేసుకుని, భూమిలో తేమశాతం తగ్గకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ పనులన్నీ ఉపాధి హామీ పథకం ద్వారానే జరుగుతాయని వివరించారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ రత్నకుమారి, నీటిపారుదలశాఖ డీఈ మనోజ్ కుమార్, మండల పరిషత్ ఏఓ మహాలక్ష్మి మంగతాయారు, ఉద్యానశాఖ అధికారి బబిత, వ్యవసాయాధికారి సోమశేఖరం, ఏపీఓ త్రిమూర్తులు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనాలకు పటిష్ట చర్యలు



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వినాయక విగ్రహాల నిమజ్జనాల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్టు ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లాలోని పోలీస్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిమజ్జన ఊరేగింపు మార్గాలను గూగుల్ మ్యాప్ ద్వారా పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వినాయక ఉత్సవాల్లో ఆఖరి ఘట్టమైన నిమజ్జనాలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పోలీసులు నిర్దేశించిన నిమజ్జన రూట్‌లోనే ఊరేగింపు వాహనాలు వెళ్లాలన్నారు.

కేసులు పెడితే దోషులవుతారా?



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, చిత్రంలో భరత్‌రామ్ తదితరులు

- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- ఎంపీ మిథున్‌రెడ్డితో ములాఖత్

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని దోషిగా ప్రచారం చేస్తోందని, ప్రభుత్వం కేసులు పెట్టినంత మాత్రాన దోషి ఎలా అవుతారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు ప్రశ్నించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డితో మాజీ మంత్రి ధర్మాన, ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు బుధవారం ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు బయట ధర్మాన మీడియాతో మాట్లాడుతూ.. ఎంపీ మిథున్‌రెడ్డిపై కేవలం కొన్ని ఆరోపణలు మాత్రమే వచ్చాయన్నారు. న్యాయవ్యవస్థ దోషి అని నిర్ధారించలేదన్నారు. ప్రభుత్వం కేసులు పెట్టిన వారంతా దోషులు కారని స్పష్టం చేశారు. మిథున్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చిత్తూరు జిల్లాలో ప్రతి కుటుంబంతో వారికి మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఇంతవరకు తుది చార్జిషీట్ వేయలేదన్నారు. చార్జీషీటు వేస్తే బెయిల్ వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయంతో మిథున్ రెడ్డి ఉన్నారన్నారు. కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి మాట్లాడుతూ.. మిథున్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఆయన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలనే కుట్రతో అక్రమ కేసు పెట్టారన్నారు. జైల్లో మిథున్‌రెడ్డి ధైర్యంగా ఉన్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నేతలను జైలుకు పంపడంపైనే దృష్టి పెట్టిందని మండిపడ్డారు.

‘ఎంఏ పొలిటికల్ సైన్స్’కు లైన్ క్లియర్

- విద్యార్థుల ఆందోళనతో దిగొచ్చిన ‘నన్నయ’ అధికారులు
- ఆ గ్రూపును కొనసాగిస్తామని ప్రకటన



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి, ప్రజా, దళిత సంఘాల ప్రతినిధులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంఏ పొలిటికల్ సైన్స్ గ్రూప్‌ను యథాతథంగా కొనసాగించాలంటూ విద్యార్థి సంఘాలు చేస్తున్న ఆందోళనలకు యూనివర్సిటీ అధికారులు దిగివచ్చారు. విద్యార్థుల కోరిక మేరకు ఆ గ్రూప్‌ను కొనసాగిస్తామని తెలిపారు. వివరాల్లోకి వెళితే.. నన్నయ వర్సిటీని ప్రారంభం నుంచీ ఫాకల్టీ సమస్య వేధిస్తోంది. అరకొరగా ఉన్న ఫ్యాకల్టీలో 80 శాతం మంది అడ్‌హాక్ అధ్యాపకులే. వీరు కూడా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లేకపోవడంతోనే వివిధ సమస్యలకు కారణమవుతోంది. ఈ క్రమంలో పొలిటికల్ సైన్స్ బోధించే ఇద్దరు అధ్యాపకులకు ఏర్పడిన వివాదం విద్యార్థుల భవితకు శాపంగా మారింది. పొలిటికల్ సైన్స్ బోధించే అధ్యాపకులు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న 22 మంది విద్యార్థులకు తరగతులు బోధించడం కష్టతరంగా మారింది. దీంతో వారిని యూనివర్సిటీ పరిధిలోని కాకినాడ క్యాంపస్‌కు పంపించాలని యూనివర్సిటీ అధికారులు భావించారు. కానీ దానికి విద్యార్థులు సమ్మతించలేదు. దీంతో ఈ విద్యా సంవత్సరానికి కొత్తగా అడ్మిషన్లు తీసుకోకూడదనే నిర్ణయానికి వచ్చిన యూనివర్సిటీ అధికారులు ఆ మేరకు ఆదేశాలు కూడా జారీ చేశారు. దీనిని విద్యార్థులు, విద్యార్థి సంఘాలతో పాటు దళిత, ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.

అధికారుల ఆదేశాల ప్రతుల దగ్ధం

ఎంఏలో పొలిటికల్ సైన్స్ గ్రూపులో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు చేయవద్దంటూ యూనివర్సిటీ అధికారులు ఇచ్చిన ఆదేశాలపై విద్యార్థులు మండిపడ్డారు. యూనివర్సిటీలో ఏర్పడిన అధ్యాపకుల సమస్యకు పరిష్కారం ఏమిటనే విషయాన్ని ఆలోచించడంతో పాటు పొలిటికల్ సైన్స్ గ్రూపును కొనసాగించాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ ప్రాంగణంలో బుధవారం ఉదయం ఆందోళనకు దిగారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో నూతన ప్రవేశాలు తీసుకోవద్దంటూ యూనివర్సిటీ అధికారులు ఇచ్చిన ఆదేశాల ప్రతులను కాల్చి, బూడిద చేశారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆ ప్రచారంలో నిజం లేదు

యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంఏ పొలిటికల్ సైన్స్ గ్రూపును తొలగిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని, ఈ గ్రూపు ఎప్పటిలాగే కొనసాగుతుందని ఆచార్య కేవీ స్వామి బుధవారం సాయంత్రం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో ఏర్పడిన కొన్ని అంతర్గత సమస్యల కారణంగా 2025–26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకోకుండా తాత్కాలికంగా నిలిపివేయాలని భావించామన్నారు. అయితే విద్యార్థుల నుంచి వస్తున్న డిమాండ్‌తో ఎప్పటిలాగే కొనసాగించాలనే నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు.

జిల్లాలో 3.30 లక్షల ఇళ్లకు కుళాయిలు

- ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ ప్రశాంతి



స్వయం సహాయక బృందాల మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జల్ జీవన్ మిషన్ కింద ఇప్పటి వరకూ జిల్లాలో 3,56,543 ఇళ్లకు గాను 3,30,000 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చినట్టు కలెక్టర్ ప్రశాంతి అన్నారు. జల్ జీవన్ మిషన్ అదనపు జాయింట్ సెక్రటరీ సి.కమల్ కిశోర్ బుధవారం న్యూఢిల్లీ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 92 శాతం గృహాల వివరాలను ఐఎంఐఎస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. జిల్లాలోని 865 పాఠశాలలు, 868 అంగన్‌వాడీ కేంద్రాలకు సురక్షిత తాగునీటి కోసం కుళాయిలు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటికే రూ.144.38 కోట్లతో 491 పనులు పూర్తి చేసి గ్రామ పంచాయతీలకు అప్పగించామని, మరో రూ.24.75 కోట్లతో చేపట్టిన 48 పనులు పూర్తి కావడంతో త్వరలో వాటిని కూడా పంచాయతీలకు అప్పగిస్తామన్నారు.

బ్యాంకు ఖాతాలకు ఈ–కేవైసీ తప్పనిసరి

బ్యాంకు ఖాతాలకు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మనం అక్షరాస్యత గురించి మాట్లాడే వారమని, కానీ నేడు ఆర్థిక అక్షరాస్యత, భౌతిక అక్షరాస్యత గురించి కూడా చర్చించాలన్నారు. బ్యాంకు ఖాతాను తెరవడం, దానిని కాలానుగుణంగా అప్‌డేట్ చేయడం, సురక్షితంగా ఖాతాను నిర్వహించడం.. ఇవన్నీ ఆర్థిక అక్షరాస్యతలో భాగమని తెలిపారు. 2014లో జన్‌ధన్ యోజన కింద జీరో బ్యాలెన్స్ ఖాతాలను చాలామంది తెరిచారని, అలాంటి వారంతా ఇప్పుడు తమ ఖాతాలకు ఈ–కేవైసీ తప్పక చేయించాలని సూచించారు. సైబర్ నేరాలు పెరిగిన నేపథ్యంలో డిజిటల్ చెల్లింపులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లలిత్ త్యాగి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆర్థిక సేవలు అందేలా చూసి, ఆర్థిక సమ్మిళితకై సంతృప్తి స్థాయిలో ప్రచారం చేపట్టాలన్నారు. భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు జూలై ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు మూడు నెలల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ స్వయం సహాయక బృందాలకు రూ.20 లక్షల చొప్పున నమూనా చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజీకి తగ్గిన వరద ఉధృతి

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీకి వరద ఉధృతి బుధవారం మరింత తగ్గింది. ఉదయం నుంచి క్రమేపి తగ్గుతూ వచ్చి.. రాత్రి 8 గంటలకు 10.70 అడుగులకు చేరింది. అయితే ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు పెరుగుతుండటంతో మరో రెండు రోజుల పాటు కాటన్ బ్యారేజీ వద్ద నీటి ఉధృతి కొనసాగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కాళేశ్వరంలో 11.20 మీటర్లు, పేరూరులో 15.85 మీటర్లు, దుమ్ముగూడెంలో 11.57 మీటర్లు, భద్రాచలంలో 41.80 అడుగులు, కూనవరంలో 17.48 మీటర్లు, కుంటలో 9.40 మీటర్లు, పోలవరంలో 11.65 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 15.70 మీటర్ల నీటిమట్టాలు కొనసాగుతున్నాయి.



కాటన్ బ్యారేజీ నుంచి విడుదలవుతున్న మిగులు జలాలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

స్ప్రేయర్ మొరాయిస్తే.. ఫియరే..!

- పరికరాలను భద్రపర్చాలంటున్న వ్యవసాయ నిపుణులు
- నెలల తరబడి వదిలేస్తే.. మొండికేసే అవకాశం
- డబ్బు, సమయం వృథా
- చిన్న జాగ్రత్తలతో రైతులకు మేలు



స్ప్రేయర్‌తో మందు చల్లుతున్న రైతులు



కేవీఎస్ రమేష్‌కుమార్

రాయవరం: పంటలకు ఆశించిన చీడపీడల నివారణకు మందులు పిచికారీ చేయడానికి రైతులు రకరకాల స్ప్రేయర్లను వినియోగిస్తుంటారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటలకు ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు పురుగు మందులను పిచికారీ చేసే పనిలో నిమగ్నమయ్యారు. పంట కాలంలో వాటితో పని ముగియగానే అలాగే వదిలేస్తారు. తర్వాత పంట కాలంలో అవసరం రాగానే స్ప్రేయర్లను మళ్లీ వినియోగించేందుకు యత్నిస్తే.. చాలావరకు మొరాయిస్తుంటాయి. అప్పుడు స్ప్రేయర్లను తీసుకుని మెకానిక్ షెడ్లకు పరుగులు పెట్టడం సర్వసాధారణం. డబ్బు వెచ్చించి రిపేరు చేయించడం కన్నా, చిన్న జాగ్రత్తలు తీసుకుంటే వృథా ఖర్చులు తగ్గడంతో పాటు, స్ప్రేయర్లు ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. ప్రస్తుతం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కాండం తొలుచు పురుగు ఆశించడంతో రైతులంతా పురుగు మందుల పిచికారీలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో స్ప్రేయర్లను భద్రపర్చే విధానాన్ని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ వివరించారు.

పవర్ స్ప్రేయర్

మందుల పిచికారీ సమయం ముగియగానే మంచి నీటితో శుభ్రం చేయాలి. ట్యాంకులో పెట్రోలు లేకుండా చూసుకోవాలి. కర్బ్యురేటర్ గిన్నెలోనూ పెట్రోలు లేకుండా చూడాలి. ప్లగ్ తీసి శుభ్రంగా పెట్రోల్‌తో కడగాలి. పిస్టన్‌పై 5–6 చుక్కల ఇంజినాయిల్ వేసి ప్లగ్‌ను బిగించాలి. ఇలా చేస్తే పిస్టన్ పాడైపోకుండా ఉంటుంది. మళ్లీ అవసరం వచ్చినప్పుడు వెంటనే స్టార్ట్ అవుతుంది.

తైవాన్

ట్యాంకులో ఐదు లీటర్ల మంచినీరు పోయాలి. ఇంజిన్ స్టార్ట్ చేసి నాజిల్ ద్వారా బయటకు పంపాలి. ఇలా చేయడం వల్ల పైపుతో పాటు, నాజిల్‌లో మలినాలు లేకుండా శుభ్రమవుతుంది. ట్యాంకులో పెట్రోలు లేకుండా తీయాలి. ప్లగ్‌ను తీసి పిస్టన్‌పై ఐదారు చుక్కల ఇంజినాయిల్ వేసి ప్లగ్ బిగించాలి. పంపు భాగాలన్నింటినీ శుభ్రంగా తుడిచి భద్రపర్చుకోవాలి.

పాడి-పంట

రీచార్జబుల్..

పనులు పూర్తయిన వెంటనే మూడు లీటర్ల నీటిని ట్యాంకులో పోసి బయటకు పంపాలి. ప్రతి 15 రోజులకు ఓసారి గంట పాటు చార్జింగ్ పెట్టాలి. ఇలా చేయడం వల్ల బ్యాటరీ డ్రెయిన్ కాకుండా ఉంటుంది. అన్నదాతలు ఆయా విషయాలు పాటించి తమ పంపు స్ప్రేయర్లను భద్రపర్చుకోవచ్చు.



స్ప్రేయర్ పరికరం

ఏడాది తర్వాత తీసినా..

మందుల పిచికారీ పూర్తి కాగానే శుభ్రమైన నాలుగు లీటర్ల మంచినీటిని ట్యాంకులో పోసి నాజిల్ ద్వారా బయటకు పంపాలి. తద్వారా స్ప్రేయర్ గొట్టం(ఇత్తడి) తీసి, దానికి ఇంజినాయిల్ పోసి మళ్లీ బిగించాలి. ఇలా చేస్తే గొట్టం తుప్పు పట్టకుండా ఉంటుంది. బుష్‌లు, రాడ్ల వద్ద ఇంజినాయిల్ పూయడం వల్ల తుప్పు రాకుండా ఉంటుంది. ఏడాది తర్వాత తీసి వాడినా బాగా పనిచేస్తుంది.

హైటెక్..

ట్యాంకులో మూడు లీటర్ల నీటిని పోసి శుభ్రంగా నాజిల్ ద్వారా బయటకు పంపాలి. తర్వాత స్ప్రేయర్ గొట్టం తీసి దానికి ఇంజినాయిల్ పోసి మళ్లీ బిగించాలి. ఇలా చేస్తే గొట్టం తుప్పు పట్టకుండా ఉంటుంది. బుష్‌లు, రాడ్ల వద్ద ఇంజినాయిల్ పూయడం వల్ల తుప్పు పట్టదు.

తల్లిదండ్రులు మందలించారని

విద్యార్థిని ఆత్మహత్య



కనిగిరి వరలక్ష్మీ అపర్ణ (ఫైల్)

శంఖవరం: చదువుపై దృష్టి సారించడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక కృష్ణాలయం వీధిలో కనిగిరి వరలక్ష్మీ అపర్ణ(16) మంగళవారం రాత్రి ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. అన్నవరం అడిషనల్ ఎస్సై ఎల్ ప్రసాద్ వివరాల మేరకు, స్థానిక ఆదర్శ పాఠశాలలో అపర్ణ ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతోంది. ఎప్పటిలాగే మంగళవారం కళాశాలకు వెళ్లొచ్చిన ఆమె ఇంటి వద్ద చదువుపై దృష్టి పెట్టలేదు. ఈ క్రమంలో ఆమె తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన అపర్ణ తన తల్లిదండ్రులు పడుకున్నాక, ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నిర్జీవంగా ఉన్న కుమార్తెను చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అపర్ణ మృతికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విచారం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్సై ప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

8న ఐటీఐ అప్రెంటిస్ మేళా

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ఈ నెల 8న అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ బుధవారం విలేకరులకు తెలిపారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఉదయం తొమ్మిది గంటలకు ఈ మేళా ఉంటుందన్నారు. ఐటీఐ ఫైనల్ ఎగ్జామ్ రాసిన విద్యార్థులు, ఇప్పటికే ఉత్తీర్ణులైన విద్యార్థులకు పీఎంఎస్ అప్రెంటిస్ మేళా–సెప్టెంబర్ 2025' నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రముఖ పరిశ్రమల నుంచి యాజమాన్య ప్రతినిధులు హాజరై, వారికి కావాల్సిన అప్రెంటిస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసుకుంటారని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్లలో శిక్షణ పూర్తి చేసి, ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు 94404 08182 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

గల్లంతైన వృద్ధుడి కోసం గాలింపు



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న ట్రైనీ ఎస్సై

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదిలో గల్లంతైన ఒలుపు కార్మికుడు బి.దొడ్డవరం గ్రామానికి చెందిన రవణం సాయిబాబు కోసం బుధవారం విస్తృతంగా గాలిస్తున్నారు. ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు చెందిన 15 మంది సభ్యుల బృందం మూడు బోట్ల సాయంతో నదిలో గాలింపు నిర్వహించారు. అతడి ఆచూకీ లభించలేదు. తహసీల్దార్ పి.సునీల్‌కుమార్, ట్రైనీ ఎస్సై జి.సోమేంద్ర గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

వివాదాస్పద ఫ్లెక్సీలపై చర్యలకు డిమాండ్

పోలీస్ స్టేషన్ వద్ద దళితుల ఆందోళన



నగరం పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

మామిడికుదురు: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వివాదాస్పద వ్యాఖ్యలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలు దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. అప్పనపల్లిలో వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటు నేపథ్యంలో బుధవారం నగరం పోలీస్ స్టేషన్ వద్ద వారు ఆందోళన నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, సినీ నటుల అభిమాన సంఘాలు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల్లో నాయకులు, హీరోల పేర్లలో బాబు సీమ, కల్యాణ్ సీమ అని అన్వయించుకోవడం వివాదాలకు కారణమవుతోందన్నారు. ఈ వ్యాఖ్యలు కొన్ని కులాలను కించపర్చేలా, రెచ్చగొట్టేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా ఫ్లెక్సీలు ప్రింటింగ్ చేస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్సై ఎ.చైతన్యకుమార్, తహసీల్దార్ పి.సునీల్ కుమార్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం, ఎమ్మార్పీఎస్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కుల విద్వేషాలను రెచ్చగొట్టొద్దు: సీపీఎం

అమలాపురం టౌన్: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా మామిడికుదురు మండలం అప్పనపల్లిలో కులవిద్వేషాలను రెచ్చగొట్టేలా ఫ్లెక్సీ పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా సీపీఎం కార్యాలయంలో పార్టీ నాయకులు బుధవారం సమావేశమై దీనిపై చర్చించారు. ఈ ఫ్లెక్సీ వేయించిన వారిపై, ముద్రించిన షాపుపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దుశ్చర్యలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు. పార్టీ నాయకులు జి.దుర్గాప్రసాద్, పీతల రామచంద్రరావు, జిల్లా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి కన్నుమూత



వెంకటరత్నం (ఫైల్)

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు వాకపల్లి వెంకటరత్నం (100) మంగళవారం రాత్రి కన్నుమూశారు. ఆయనకు ఆరుగురు కుమార్తెలు, కుమారుడు సంతానం. 18 మంది మనవలు, 28 మంది ముని మనవలు, పది మంది అని మనవలు ఉన్నారు. మరణించే వరకు ఆయన పనులు స్వయంగా చేసుకునేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. మరణానికి నాలుగు రోజుల ముందు ఆరోగ్య సమస్యలు ఏర్పడి కన్నుమూశారని కుటుంబ సభ్యులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



కృష్ణంపాలెం వద్ద ప్రమాదానికి గురైన మేజిక్ వాహనం

దేవరపల్లి: వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. మండలంలోని కృష్ణంపాలెం వద్ద గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టాటా మేజిక్ డ్రైవర్ నాని(28) మృతి చెందగా, వాహనంలో ఉన్న ముగ్గురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం గోపాలపురం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యానికి రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. కృష్ణంపాలెం వద్ద ముందు వెళుతున్న లారీని కంటైనర్ ఢీకొంది. అదే సమయంలో డ్యాన్సర్లతో వస్తున్న టాటా మేజిక్ వెనుక నుంచి కంటైనర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం అజ్జరానికి చెందిన డ్రైవర్ నాని(28) మృతి చెందగా, డ్యాన్సర్లు చరణ్ ఢిల్లీరావు, హరిసంతోష్, కరిష్మా తీవ్రంగా గాయపడ్డారు. విశాఖపట్నం నుంచి నెల్లూరుకు ప్రోగ్రాం కోసం 8 మంది వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.



డ్రైవర్ నాని(ఫైల్)

మృతుడు నాని కూడా డ్యాన్సరేనని కుటుంబ సభ్యులు తెలిపారు. అతడికి ఇటీవల నిశ్చితార్థమైంది. రెండు నెలల్లో వివాహం కావాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోపాలపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

కుమార్తెను చూసేందుకు వెళ్తూ..

అయినవిల్లి: సడన్ బ్రేక్ వేయడంతో ఆటో తిరగబడిన ప్రమాదంలో ప్రయాణికుడు మృతి చెందాడు. ఎస్సై హరికోటిశాస్త్రి వివరాల ప్రకారం, బుధవారం చింతనలంక చిన రామాలయం వీధికి చెందిన గోసంగి తనుకులు(75) ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలోని తన కుమార్తెను చూసేందుకు బయలుదేరాడు. ముక్తేశ్వరంలో ఆటో ఎక్కి అమలాపురం వెళ్తుండగా, రావిగుంట చెరువు వద్ద ఆటోడ్రైవర్ అతివేగంగా వెళ్తూ సడన్ బ్రేక్ వేశాడు. ఆటో బోల్తా పడడంతో తనుకులు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అతడి కుమారుడు అంజి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వర్షంలో ప్రయాణిస్తూ..

అమలాపురం టౌన్: కిమ్స్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్రంగి మేస్త్రీ మరణించాడు. పట్టణ ఎస్సై ఎన్ఆర్ కిషోర్‌బాబు వివరాల మేరకు, అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి గ్రామానికి చెందిన వడ్రంగి మేస్త్రీ గోడ ఫణికుమార్(32) వర్షం కురుస్తున్న సమయంలో స్కూటీపై వెళుతున్నాడు. అమలాపురం వైపు వస్తున్న ట్రాక్టర్ అతడిని వెనుక నుంచి ఢీకొంది. మరో బైకిస్టును కూడా ట్రాక్టర్ ఢీకొట్టడంతో అతనూ గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఫణికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు.

భర్త దూరమయ్యాడని.. తానూ తిరిగిరాని లోకానికి..

- రెండేళ్ల బిడ్డతో తల్లి ఆత్మహత్య
- జూలైలో భర్త బలవన్మరణం



భర్త గోపి, బిడ్డతో ఆకాంక్ష (ఫైల్)

కాకినాడ రూరల్: సాఫీగా సాగే వారి పచ్చని సంసారాన్ని అప్పుల సుడిగుండం ముంచేసింది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న రెండేళ్ల మగ బిడ్డకు పుట్టిన రోజును స్తోమతకు మించి ఘనంగా చేశారు. ఆ అప్పు భారంగా మారడంతో, ఈ ఏడాది జూలై నెలలో భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఒకటిన్నర నెలలు తిరక్కుండానే బిడ్డతో కలిసి భార్య ఆత్మహత్యకు పాల్పడడంతో ఆ కుటుంబానికి విషాదాంతమే మిగిలింది. సర్పవరం పోలీసుల వివరాల మేరకు, కాకినాడ రూరల్ సర్పవరం గ్రామంలోని భావనారాయణపురం గాంధీనగర్‌కు చెందిన జనపల్లి ఆకాంక్ష(25) తన బిడ్డ సార్విక్(2)కు పురుగు మందు పట్టించి, తాను ఆత్మహత్యాయత్నం చేసుకుంది. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కరప మండలం గురజానాపల్లికి చెందిన ఆకాంక్షకు, సర్పవరం గ్రామానికి చెందిన జనపల్లి గోపితో మూడేళ్ల క్రితం వివాహమైంది. కాకినాడ నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా గోపి పనిచేసేవాడు. జూలైలో బిడ్డ సార్విక్ రెండో పుట్టిన రోజును ఘనంగా జరిపారు. ఇందుకు రూ.3 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పు ఇచ్చినవారి ఒత్తిడిని తట్టుకోలేక గోపి జూలై 22న మద్యంలో పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో ఆకాంక్ష మానసికంగా కుంగిపోయింది. కొన్ని రోజులు పుట్టింటి వద్ద, కొంతకాలం అత్తింటి వద్ద ఉండేది. భర్తపై బెంగతో గత నెల 31న మధ్యాహ్నం సర్పవరంలోని ఇంట్లో సోడాలో పురుగు మందు కలిపి బిడ్డకు పట్టించి, తాను తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వారిని కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున ఇద్దరూ మృతి చెందారు. ఆకాంక్ష తల్లి డోనం శాంతికుమారి ఫిర్యాదు మేరకు సర్పవరం ఏఎస్సై నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం సర్పవరం భావనారాయణపురంలో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.